రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.34 (శనివారం సాయంత్రం)
సహర్ : 4.50 (ఆదివారం ఉదయం)
మృదుత్వాన్ని మెతక వైఖరిని అనుసరించే వారిగా ఎవరైతే ఉంటారో అల్లాహ్ వీరికోసం నరకాన్ని నిషేధించాడు.


● ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ముమ్మరంగా ఉపాధి పనులు

- ఉపాధి పనులకు పెరుగుతున్న కూలీలు
- జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పనులు
- నిబంధనలు మారడంతో తక్కువ పనులకే మోక్షం
- గతంలో లాగా పూడికతీత పనులు చేపట్టాలంటున్న కూలీలు
- సర్వర్ మొరాయింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది
- పదిహేను రోజులకొకసారి డబ్బులు జమ చేయాలంటున్న కూలీలు

నిజామాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధి పనుల కోసం కూలీలు క్యూ కడుతున్నారు. ఉదయమే పనులకు తరలివెళ్తున్నారు. ఎండలను సైతం లెక్క చేయకుండా పనులు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పనులకు హాజరవుతున్నా- కొన్నిసార్లు సర్వర్ మొరాయించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడి పనులు చేసినా.. ఖాతాలో డబ్బులు జమయ్యేందుకు మాత్రం నెలకన్న ఎక్కువ రోజులే పడుతుందని కూలీలు వాపోతున్నారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనులపై నల్లబెల్లి గ్రామంలో పరిశీలించగా పలు అంశాలు బయట పడ్డాయి. కూలీలు మాత్రం నిబంధనల మేరకు గతంలాగా పనులను చేపట్టాలని కోరుతున్నారు. చెరువు పనులతో పాటు పూడికతీత పనులకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

నెల రోజులుగా కొనసాగుతున్న పనులు

జిల్లాలో గడిచిన నెల రోజులుగా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల పరిధిలో పరిధిలో అవసరమైన పనులను ఎంపిక చేసి కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. వ్యవసాయ పనులు తగ్గడం వల్ల జిల్లాలో అనేక మంది జాబ్‌కార్డులు ఉన్న వారు ఉపాధి పనులకు వెళ్తున్నారు. జిల్లాలో అన్ని గ్రామాల పరిధిలో ప్రతిరోజూ 33వేల నుంచి 34వేల మధ్య కూలీలు పనులకు హాజరవుతున్నారు. పని ప్రదేశాల్లో మాత్రం కొంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్చిన నిబంధనల ప్రకారం కొన్ని పనులే చేయాల్సి వస్తుంది. గ్రామాల పరిధిలో ఫిష్ పాండ్‌లు, ఎంఐ ట్యాంక్‌లు, కాలువలు, భూ అభివృద్ధి పనులు మాత్రమే చేపడుతున్నారు. ఇవేకాకుండా నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్‌లో పనులను కల్పిస్తున్నారు. అటవీ ప్రాంతంలో అవసరమైన కందకాలు తీస్తున్నారు. ఇవన్నీ గట్టి పనులు కావడం వల్ల కూ లీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ పని చేసే కూలీకి 300 రూపాయలు చెల్లింపులు చేయాలి. ఉపాధి పనికి వచ్చే కూలీలకు సగటున 200 నుంచి 250 మధ్యనే వేతనం వస్తుంది. గతంలో చెరువుల్లో పూడికతీత పనులు, కాలువల్లో మరమ్మతులు, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో మట్టితీత పనులు చేపట్టారు. ఈ పనులు ఎక్కువ మొత్తంలో చేసే అవకాశం ఉండటం మెత్తటి మట్టి కావడం వల్ల ఎక్కువ పనులు చేయడంతో కూలీ వచ్చేది. ప్రతి ఒక్కరికి 300రూపాయల వరకు కూలి పడేది. ప్రస్తుతం కందకాలు తీయడం, ఇతర పనులను చేపట్టడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎండలు పెరగడం, 40 డిగ్రీలు దాటడం వల్ల పని ప్రదేశంలో చేయడం వారికి కష్టంగా మారింది. అన్ని గట్టి పనులే కావడం టెక్నికల్ అసిస్టెంట్‌లు చూపించిన మేరకు పనులు చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు.

4లక్షల 83వేల 762 మంది కూలీలు

జిల్లాలో 2లక్షల 55వేల 236 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 4లక్షల 83వేల 762 వరకు కూలీలు ఉన్నారు. ప్రతీ సంవత్సరం సగటున లక్షన్నర జాబ్‌కార్డుల వరకు పనులను కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఎన్ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ వల్ల పని ప్రదేశాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పనిచేసే కూలీలను వారికి సంబంధించిన ఫొటోలు ప్రతీరోజు అప్‌లోడ్ చేస్తేనే ఆ రోజుకు సంబంధించిన మస్టర్ పడుతుంది. పది మందికి ఒక ఫొటో అప్‌లోడ్ చేస్తారు. అయితే ప్రతీరోజు సర్వర్ డౌన్ ఉండటం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. పనులు చేస్తున్న వారు గతంలో లాగానే 15 రోజుల కొకసారి జమ చేయాలని కోరుతు న్నారు. కొన్ని గ్రామాల పరిధిలో పనిచేస్తున్న ప్రాంతాల్లో టెంట్లు వేస్తుండగా మరికొన్ని గ్రామాల పరిధిలో వేయడం లేదు. తాగునీటిని సరఫరా చేస్తున్నా కొన్నిచోట్ల కూలీలే తాగు నీరును తీసుకువస్తున్నారు. అటవీ ప్రాంతంలో పనిచేసే కూలీలకు చెట్ల వద్దనే ఉండే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. గతంలో వేసవి కాలంలో పనిచేసే కూలీలకు సమ్మర్ అలవెన్స్ 30 శాతం ఇచ్చేవారు. గడిచిన కొన్నేళ్లుగా ఉపాధి కూలీలకు ఇవ్వడం లేదు. జిల్లాలో అన్ని గ్రామాల పరిధిలో ఉపాధి పనులు జరిగే విధంగా ఏర్పాట్లు చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి ఇంకా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించే విధంగా అన్ని గ్రామాల పరిధిలో కొత్త పనులను గుర్తిస్తున్నామన్నారు.




● కబ్జా శిఖం భూమిలో కోతకు వచ్చిన వరి పంట
శిఖం కబ్జా భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

శిఖం భూముల కబ్జాపై మౌనమేలా?

- వరినాట్ల సమయంలో ఫిర్యాదు.. కోతలు వచ్చినా కదలని యంత్రాంగం
- కబ్జాదారులపై చర్యలకు అధికారుల వెనకడుగు
- కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న రైతులు

ఎడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు చెరువులతో పాటు అన్ని గ్రామాల్లోని చెరువుల శిఖం భూములు కబ్జాలకు గురైనా మాకేంటి అన్న రీతిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఒక్క ఎడపల్లి మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువులోనే దాదాపు 56 ఎకరాల శిఖం భూమిని కబ్జా చేసి వరి నాట్లు వేశారంటే మండలంలో ఉన్న మిగతా చెరువుల పరిస్థితి చెప్పకనే చెప్పవచ్చు. మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో కబ్జా చేసిన శిఖం భూమిలో ఏకంగా బోర్లు వేయగా వారికి వంతపాడుతూ విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం చూస్తుంటే అధికారులే చెరువు శిఖం భూములను దర్జాగా కబ్జా చేసుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

ఎడపల్లి పెద్ద చెరువులో శిఖం భూమిని కబ్జా చేసి వరినాట్లు వేశారని రెండు నెలల క్రితం తహసీల్దార్‌కు దుబ్బాతండా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న ఆంతర్యమేమిటో అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. వరికోతలు ప్రారంభమైనా ఇప్పటి వరకు కబ్జా భూములపై చర్యలకు అధికారులు వెనకడుగు వేస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇరిగేషన్ అధికారులు అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అంతర్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

శిఖం కబ్జాకు ఉపాధి పనులు తోడు

ఎడపల్లిలోని చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుంటే మరో వైపు ఉపాధి హామీ పనుల ద్వారా చెరువు మట్టిని తవ్వి అడ్డుగా వేస్తున్నారు. కబ్జాకు తోడు ఉపాధి పనులు సైతం తోడవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. కబ్జాలను వెలికి తీసేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధిహామీ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోతల తర్వాత చర్యలు తీసుకుంటాం..
: ధన్వాల్, (తహసీల్దార్)

చెరువు శిఖంభూమి ఇరిగేషన్‌కు సంబంధించినది. సర్వేయర్, ఆర్ఐతో సర్వే చేయించాం. శిఖం భూమిని కబ్జా చేసి పంట వేసినది నిజమని తేలింది. శిఖం భూమిలో వరి నాట్లు వేసినందున పంట కోత అనంతరం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.


జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడుతున్న పోచారం, చిత్రంలో కలెక్టర్

సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్‌గాంధీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 28: జిల్లాలోని వర్ని మండలం సిద్దాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సిద్దాపూర్ పనుల ప్రగతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ల్యాండ్ అండ్ సర్వే అధికారుతో పోచారం, రాజీవ్ గాంధీ హన్మంతు సమీక్ష జరిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల స్థితిగతుల గురించి అధికారులు పోచారం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా!? అని అధికారులను పోచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోచారం, రాజీవ్ గాంధీ మాట్లాడుతూ.. సిద్దాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి సాగునీటి వసతి లేని తండాలు, అనేక గ్రామాలకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలవనుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అంకిత భావంతో పని చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్ మీనా, కామారెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలి

● సీపీ సాయి చైతన్య

ఖిల్లా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఉగాది, రంజాన్ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. ఫుట్ పెట్రోలింగ్‌లో భాగంగా గురువారం అర్ధరాత్రి నగరంలోని జామ మజీద్, బర్కత్‌పుర, ఆటోనగర్, మాలపల్లి, శంబునిగుడి, గురుద్వారా తదితర ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సీపీ మాట్లాడారు. పరిస్థితి, శాంతిభద్రతల విషయాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణాదారులతో మాట్లాడుతున్న సీపీ

నగరంలో బందోబస్తును పరిశీలించిన సీపీ సాయిచైతన్య

రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. ప్రార్థనలు జరిగే సమయంలో నగరంలోని ఆయా మజిద్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు అధికారులు ఏర్పాటు చేశారు. గాంధీగంజ్, మార్కెట్ క్లాక్‌టవర్, నెహ్రూపార్క్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో నిజామాబాద్ ఏసీపీ ఎల్. రాజావెంకట్ రెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్సైలతో కలిసి పోలీసు కమిషనర్ సాయిచైతన్య పర్యటించారు.


● నగరంలో పర్యటిస్తున్న సీపీ

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది

- రైతుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదు
- రైతు సత్యాగ్రహ దీక్షలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గోస వినిపించుకోవడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ముఖ్య అతిథిగా మాట్లాడరు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చేసిన హామీలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. పంటలకు నీరు లేక రైతులు కష్టాల్లో ఉన్న ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. అకాల వర్షాలు, కరెంటు కోతల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసా, వరికి బోనస్ రూ.500 ఇవ్వాలన్నారు. ఇటీవల జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుపై కాంగ్రెస్ నేతలు అసహనం చూపుతున్నారని అన్నారు. గతంలో పసుపు రైతుల కోసం రోడ్డెక్కిన కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం మౌనంగా ఉండటం దురదృష్టకరమన్నారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి సకాలంలో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి మాట్లాడుతూ సాగునీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయాయని రూరల్ నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వం సాగునీరు ఇవ్వడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మినారాయణ, ప్రశాంత్ భూషణ్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


రైతు సత్యాగ్రహ దీక్షలోమాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ట్యాంకర్ ద్వారా పంటలకు నీరు


ట్యాంకర్ ద్వారా పంటకు నీరు పారిస్తున్న రైతు అల్లూరి నవీన్‌రెడ్డి

● పంట ఎండిపోకుండా రైతుల తంటాలు

జక్రాన్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క మండుతున్న ఎండలు, మరో పక్క బోరు బావులు ఎత్తిపోవడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్ గ్రామానికి చెందిన రైతు అల్లూరి నవీన్‌రెడ్డి రెండు ఎకరాల్లో వరి పంటకు సాగు చేశాడు. అయితే మండుతున్న ఎండలకు బోరుబావి ఎత్తిపోయింది. దీంతో ఆ రైతు వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్‌ను అద్దెకు తెచ్చుకొని రోజు వరి పంటకు నీళ్లు పెడుతున్నారు. పంట మంచిగా ఉన్నందున దిగుబడి వచ్చే అవకాశం ఉందని చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎనిమిది ట్యాంకర్‌లకు ఐదు ఇసాల మడి పారుతుందని తెలిపారు. దీంతో తన పంట గట్టెక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళ దారుణ హత్య

- తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులకు దొరికిన వ్యక్తి
- కారులో మృతదేహాన్ని తరలిస్తుండగా వెంబడించి పట్టుకున్న పోలీసులు
- హత్యకు గల కారణాలపై ఇంకా రాని స్పష్టత

ఖిల్లా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళను దారుణంగా హత్య చేసి.. మృతదేహాన్ని తప్పించే ప్రయత్నంలో పోలీసులకు దొరికిపోయాడో వ్యక్తి. వాహనాలు తనిఖీ చేస్తున్నప్పుడు తప్పించుకుని అతివేగంగా వెళ్తున్న కారును పోలీసులు వెంబడించి మరీ పట్టుకున్న ఘటన జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నగర శివారులోని దాస్‌నగర్ వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ నుంచి మాక్లూర్ వైపు అతి వేగంతో ఓ కారు వెళుతోంది. మార్గమధ్యలో దాస్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ఆ కారును ఆపేందుకు ప్రయత్నించారు. కానీ కారు నడుపుతున్న వ్యక్తి పోలీసులను చూసి వాహనాన్ని వేగంగా మాక్లూర్ వైపునకు వెళ్లాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆ కారును వెంబడించారు. అయితే కారులో ఉన్న వ్యక్తి.. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మహిళ మృతదేహాన్ని పక్కనే గల నిజాంసాగర్ కాలువలో పడేసేందుకు యత్నించాడు. కానీ అదే సమయానికి పోలీసులు చేరుకోవడంతో అతను వేసుకున్న పథకం బెడిసి కొట్టింది. పోలీసులు కారులో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్, రూరల్ ఎస్సై ఆరీఫ్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన మహిళ నిజామాబాద్‌లోని ముబారక్‌నగర్‌కు చెందిన కమల(46)గా గుర్తించారు. ఆ తర్వాత కారుతో పాటు కారు నడుపుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నారు. కాగా.. కమల అనే మహిళ గురువారం నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబసభ్యులు ఉదయమే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఆమె హత్యకు గురి కావడం కలకలం రేపింది. మరోవైపు.. కమల హత్యపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదని నిజామాబాద్ రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు. హత్య ఎందుకు చేశాడు !? కారణమేంటి !? హత్య వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా!? అన్న అన్ని అషయాలపైనా దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.


కారు వద్ద కమల మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


కమల (ఫైల్)



పెర్కిట్ బైపాస్ రోడ్డులో పోలీసులకుసూచనలు చేస్తున్న సీపీ

వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి

● సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్ మార్చి28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పక ధరించాలని సీపీ సాయిచైతన్య వాహన దారులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదాలు జరిగే ప్రాంతాలైన పెర్కిట్ బైపాస్ జంక్షన్, కరీంనగర్ అండర్ పాస్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో జరిగే ప్రమాదాలను ఏలా తగ్గించాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీస్ డిపార్ట్‌మెంట్, హైవే డిపార్ట్‌మెంట్ వారికి సూచనలు చేశారు. అనంతరం పట్టణం లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, పలు కేసులపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణతో చర్చించారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఐరాడ్ ప్రాజెక్టు మేనేజర్ వర్ష, నేషనల్ హైవే సిబ్బంది రామారావు, విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ ప్రతి రైతుకు వర్తింపజేయాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. రుద్రూరు విండో 90వ మహజన సభ అధ్యక్షుడు సంజీవ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గత వార్షిక లావాదేవీలను సంఘ సభ్యులకు వివరించారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా వర్తించకపోవడంపై పలువురు మండిపడ్డారు. రెండు లక్షల లోపు ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు శంకర్, మాజీ జడ్పీటీసీ గంగారాం, డైరెక్టర్లు గోపి, అశోక్, గజేందర్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లుపై నిరసన

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు ఆదేశం అనవసరమని వర్ని మండల కేంద్రంలో శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. వర్ని జామ మసీద్ వద్ద మోడీ సర్కార్ ప్రవేశ పెట్టనున్న వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ముస్లిం, మైనారిటీ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రధాని మోడీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. తక్షణమే మోడీ సర్కార్ తన వైఖరి మార్చుకోకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం చిలక తండాలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు దృష్టికి గ్రామ ప్రజలు తీసుకువెళ్లగా వారు స్పందించారు. సొంత ఖర్చుతో బోరు వేయించి నీటి సమస్య తీర్చారు. అందుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ శ్రీలత, సంతోష్, పండరి, వేణు, సాయిలు, సోమ్లా, గోవింద్, రమేష్, దేవ్‌సింగ్, తారే, రవి, హర్ష పాల్గొన్నారు.

రైతు భరోసా చెల్లించాలి

నవీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదెకరాలలోపు గల రైతులకు రైతు భరోసా చెల్లించాలని నాగేపూర్ సొసైటీ మహజన సభలో తీర్మానించారు. శుక్రవారం సొసైటీ ఆవరణలో జరిగిన 63వ మహజన సభలో పలు తీర్మానాలు ఆమోదించారు. అర్హులైన రైతులకు 2లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని, యాసంగికి సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎరువుల గోదాములకు మరమ్మత్తులు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, వైస్ చైర్మన్ సత్యం రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, బేగరి సాయిలు, ధర్మాజీ, అంబర్ సింగ్, మనోజ్ కుమార్, నీలం సాయిలు, రవీందర్, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సౌండ్ సిస్టం, మైక్ సెట్ అందజేత

నవీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్ లోని వివేకానంద గ్రంథాలయానికి శుక్రవారం బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు సౌండ్ సిస్టంతో పాటు మైక్ సెట్‌ను అందజేశారు. సుమారు 7వేల రూపాయల విలువైన సౌండ్ సిస్టం, మైక్ సెట్‌ను గ్రంథాలయానికి అందించడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ హన్మాండ్లును యూత్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి రొయ్యల శేఖర్, మహేష్, ఉదయ్, చరణ్, రాకేష్, రాజు, సంజయ్ తదితరులున్నారు.

పాఠశాలకు ..

జక్రాన్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1999-2000 బ్యాచ్ విద్యార్థులు తమవంతుగా శుక్రవారం పాఠశాలకు మైక్ సౌండ్ సిస్టంను అందజేశారు. సుమారు రూ.20 వేల విలువ గల సౌండ్‌సిస్టంను పాఠశాలకు వారు అందజేశారు.

కోటగిరి మాజీ ఎంపీపీకి పరామర్శ

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సులోచనకు ఇటీవల సర్జరీ కావడంతో ఆమెను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సంతోష్, నవీన్, గంగాప్రసాద్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ ఇచ్చినట్లే దొడ్డు రకం ధాన్యానికి బోనస్ ఇవ్వాలని బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి శుక్రవారం ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఒక్క గింజ ధాన్యం బస్తా సైతం కొనుగోలు చేయలేదన్నారు. వడగండ్ల వాన కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ధాన్యానికి ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రా పీహెచ్‌సీ తనిఖీ

మోస్రా, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజు, అసిస్టెంట్ మైక్రో బయోలాజీ టాస్క్‌ఫోర్స్ వినయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మొత్తం పలు రకాలైన మందులు, ప్రాథమిక చికిత్స ఆపరేషన్, 30రకాలైన మందులు ఉండాలని అవన్నీ పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

బోనస్ కుంభకోణంలో విజిలెన్స్ విచారణ జరిపించాలి

● కోటగిరి సీపీఐ నాయకుల ధర్నా, రాస్తారోకో

కోటగిరి,మార్చి28(ఆంధ్రజ్యోతి): ధాన్యం బోనస్ కుంభకోణంలో విజిలెన్స్ విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం బోనస్ డబ్బులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. విండో చైర్మన్ కూచి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు విఠల్ గౌడ్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి వడ్లను పండిస్తే అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయన్నారు. దిక్కుతోచక రైతులు దళారులకు ధాన్యం అమ్ముకుని తీవ్రంగా నష్టపోయ్యారన్నారు. అలాంటి రైతులకు లాభం చేయకుండా తమ అనుచరులకు మాత్రమే లబ్ది చేకూరేలా బోనస్ స్వాహా చేసిన విండో అధ్యక్షులు కూచి శ్రీనివాస్‌పై తగిన చర్యలు చేపట్టాలన్నారు. తన బంధువులు, అనుచరులను బినామీ రైతులుగా మార్చి బోనస్ కుంభకోణానికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు మంచి చేస్తామని చెప్పి ప్రజాప్రతినిధులుగా గెలిపిస్తే విండో అధ్యక్షులు శ్రీనివాస్, కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ రైతుల నోట్లో మట్టి కొట్టడంతో పాటు ప్రభుత్వ ఖాజానాకు గండికొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అండ చూసుకుని ఈ ఇద్దరు నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బోనస్ కుంభకోణానికి పాల్పడిన నాయకులతో పాటు బోగస్ రైతుల నుంచి నిధులను రికవరీ చేసి క్రిమినల్ కేసులు



కోటగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘం చైర్మన్, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై పెద్ద మొత్తంలో కుంభకోణానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలుపై విజిలెన్స్ విచారణ జరిపించి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, హన్మాండ్లు, వీరేశం, రైతులు సాయిలు, గంగాధర్, రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలి

● వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,మార్చి28(ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వం తరపున శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం ఉపవాప దీక్షలను విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ఎంతో పవిత్రమైందని ఆయన పేర్కొన్నారు. ముస్లింసోదరులు రంజాన్ పండుగను ఆనందోత్సహల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు మండలంలోని శ్రీనివాస్ రెడ్డి కాలనీ, అడ్కాస్‌పల్లి గ్రామాలలో పోచారం పర్యటించారు. శ్రీనివాస్ రెడ్డి కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అడ్కాస్‌పల్లి గ్రామంలో స్థలాన్ని పరిశీలించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేశారు. అడ్కాస్‌పల్లి గ్రామంలో 16ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు శ్రీధర్, కృష్ణా రెడ్డి, మనోహర్, ఏజాజ్ ఖాన్, జుబేర్, బాబుఖాన్ పాల్గొన్నారు.



కోటగిరి ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న పోచారం

● రుద్రూరు మండల కేంద్రంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ హజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. ముస్లింసోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారోజి గంగారాం, సంజీవ్ రెడ్డి, తోట శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఫొటోల వివాదం

● మహిళల ఫొటోలు తీస్తున్న సెక్యూరిటీ గార్డులు

● సస్పెండ్ చేసిన సూపరింటెండెంట్



ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న మహిళలు

బోధన్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల మానవతా దృక్పథంతో సేవలు అందించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది అర్ధరాత్రి ఫొటోలు తీయడం వివాదస్పదంగా మారింది. వైద్యం కోసం వచ్చిన వారి బంధువులు నిద్రమత్తులో ఉండగా ఫొటోలు తీయడం వివాదస్పదంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి నయీం అనే సెక్యూరిటీ గార్డు రాత్రి ఒంటి గంట సమయంలో రోగి వెంట పడుకున్న బంధువుల ఫొటోలను తీయడం వివాదస్పదంగా మారింది. రోగి బంధువులు మేల్కొని ఇంత రాత్రిపూట ఫొటోలు ఎందుకు తీస్తున్నావని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో ఉదయం ఆందోళన నిర్వహించి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. జలాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాల రోగులు గురువారం అర్ధరాత్రి చికిత్స పొందుతున్న రోగులతో పాటు జనరల్ వార్డులో పడుకున్నారని తెలిపారు. ఒంటి గంట ప్రాంతంలో సెక్యూరిటీ గార్డు మహిళల ఫొటోలు తీయడం కొందరు మహిళలు చూశారన్నారు. ఫొటోలు తీయడం ఎందుకని ప్రశ్నించడంతో వివాదస్పదంగా మారింది. బోధన్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్ వద్దకు ఫిర్యాదు చేయగా విచారించిన సూపరిండెంట్ సెక్యూరిటీ గార్డు నయీమ్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కాంట్రాక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులు, సంబంధిత బంధువుల పట్ల అర్ధరాత్రి ఫొటోలు తీయడం సరికాదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను సెక్యూరిటీ సిబ్బంది మానవతా దృక్పథంతో చూడాలని, ఇలాంటి తప్పిదాలుచేస్తే ఊరుకునేది లేదన్నారు.

క్షత్రీయ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీతకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం మామిడిపల్లి క్షత్రీయ సమాజ్ మహిళ మండలి ఆధ్వర్యంలో క్షత్రీయ ప్రాంతీయ సమాజ్ మహిళ మండలి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీతను ఘనంగా సన్మానించారు. ఇటీవల క్షత్రీయ సమాజ్ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడంతో ఖాందేశ్ సంగీతను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాందేశ్ సంగీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయ మన్నారు. మహిళల్లో కష్టపడే తత్వం, జవాబుదారి తనం ఉంటుందని, ప్రముఖ కంపెనీలు మహిళలకే సీఈవో బాధ్యతలు అప్పగిస్తున్నారంటే ఉద్యోగం పట్ల మహిళలకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు ఖాందేశ్ సుదర్శన్, కార్యదర్శి అల్జాపూర్ నందకిశోర్, కోశాధికారి రాందాస్, యూత్ అధ్యక్షుడు వేణు, కిరణ్, సుజాత, కవిత, వాణి, ఇంద్ర, గౌతమి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికతో దేశం అభివృద్ధి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒకేసారి దేశం మొత్తం ఎన్నికలు జరిగితే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని రుద్రూరు మండల బీజేపీ నాయకులు హరికృష్ణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఒకే దేశం ఒకే ఎన్నికపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, గణేష్, గజేందర్, శివప్రసాద్, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే సతీమణి

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా పాతిమా శుక్రవారం బోధన్‌లో పర్యటించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఓ ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొబిన్ హైమద్, డాక్టర్ షరీర్‌లతో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామకు చెందిన కర్రోల్ల పోశెట్టి(43) అనే వ్యక్తి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. మద్యానికి బానిసైన పోశెట్టి ఇటీవల వచ్చిన రైతు భరోసా డబ్బులను సైతం ఖర్చు చేశాడని అన్నారు. ఈ విషయమై భార్య రోజా తన భర్తను నిలదీయడంతో ఈ నెల 26న బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకలేదని అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తకుంట చెరువులో పోశెట్టి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య రోజా, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,మార్చి28(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం పాల్దా సమీపంలో గురువారం ఉదయం ఆటోను టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిజాంకాలనీకి చెందిన మిర్జా మహ్మద్ సలీం బేగ్, గౌతంనగర్‌కు చెందిన మహ్మద్ అస్లాం, ఎల్లమ్మ గుట్టకు చెందిన మహ్మద్ అన్వర్‌లు ఆటోలో నిజామాబాద్ నుండి మాక్లూర్ మండలం మాదాపూర్‌కు వెళ్తుండగా పాల్దా సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొందని అన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మిర్జా మహ్మద్ సలీం బేగ్, మహ్మద్ అస్లాంలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా స్వల్ప గాయాలైన మహ్మద్ అన్వర్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించడం జరిగిందని అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల పట్టివేత

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల జరిమానతో పాటు ఒకరోజు సాధారణ జైలుశిక్ష విధించడం జరిగిందని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పేకాట ఆడవద్దని, అధికంగా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు.

వర్నిలో రూ.500 నకిలీ నోట్లు

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలో రూ.500 నకిలీ నోట్లు కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఉమ్మడి వర్ని మండలంలో ఈ నకిలీ నోట్లను యథేచ్ఛగా చెలామణి చేస్తున్నాడు. తన వ్యవసాయ కూలీ పనులకు వచ్చే కూలీలకు కూలీ కింద రూ.500నోట్లను అందజేస్తున్నారు. గురువారం రాత్రి ఓ పేకాట స్థావరం వద్ద ఒకే వ్యక్తి వద్ద 11నోట్లు 500చొప్పున లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ 500నోట్లపై ఆరా తీస్తే వర్నికి చెందిన వ్యక్తి తమకు ఇచ్చినట్లు తెలిపారు. సదరు వ్యక్తి లక్షల రూపాయలు నకిలీ నోట్లు చలామణి చేస్తూ అమాయకులను బురిడి కొట్టిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉంటూ నకిలీ నోట్ల బాగోతం బయట పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బషీరాబాద్‌లో చలివేంద్రం ఏర్పాటు

కమ్మర్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ గ్రా మంలో ప్రభుత్వ అదేశాలమెరకు స్థానిక బస్టాంవద్ద గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీరాముల మురళి, వీడీసీ అధ్యక్షుడు డబ్బుగల ఆనంద్, ఉపాధ్యక్షుడు పోలీసు రాము లు, తోట అప్పయ్య, పార్వతి రాజు, సత్యానంద్ సిసిలు సీఏలు అంగన్ వాడి టీచర్లు, గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో కుంభకోణాలకు బాధ్యులెవరు?

● సభలో అధికారులను నిలదీసిన సభ్యులు

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో రెండు పాలకవర్గాల తప్పిదాలతో పెద్ద ఎత్తున కుంభకోణాలు జరిగాయని ఈ కుంభకోణాలకు బాధ్యత ఎవరు వహిస్తారని సంఘ సభ్యులు అధికారులను నిలదీశారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ సహకార సంఘం 82వ మహజన సభ విండో అధ్యక్షులు రాందాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలో జరిగిన లావాదేవీలను సభ్యులకు వివరించారు. సహకార సంఘంలో సుమారు 10కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారని ఆ నిధులను త్వరితగతిన గత పాలకవర్గ సభ్యుల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంటీ బియ్యం బిల్లు 6.33లక్షల రూపాయలు రికవరీ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు నిలదీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నష్టాల్లో ఉన్నందున సిబ్బంది వేతనాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ఎత్తొండ సొసైటీలో అధికారులను నిలదీస్తున్న దృశ్యం

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ అంబర్ సింగ్ రాథోడ్, విండో కార్యదర్శి రాజశేఖర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ లోని వారి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర విత్తనాభి వృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. విత్తనాభి వృద్ధి సంస్థకు నిధులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అవస్థలపై స్పందించిన కమిషనర్



ప్రింటర్‌లు, సిస్టమ్‌లు ఏర్పాటు చేస్తున్న కమిషనర్

ఆర్మూర్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల అవస్థలపై గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ కమిషనర్ రాజు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని మిటింగ్ హాల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు అవస్థలు పడకుండా మూడు ప్రింటర్‌లను, ఐదు సిస్టంలను ఏర్పాటు చేశారు. దీంతో దరఖాస్తుదారులకు కూర్చొవడానికి కూర్చిలు ఉండడంతో హర్షం వ్యక్తం చేశారు.

రూ.30లక్షలు పలికిన తైబజార్ వేలం పాట

ఆర్మూర్‌టౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్‌లకు సంబంధించి తైబజార్ వేలం పాట రూ.30లక్షలు పలికింది. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహించగా ముగ్గురు కాంట్రాక్టర్‌లు పాల్గొని మహమ్మద్‌షఫీ అనే వ్యక్తి సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలాన్ని దక్కించుకున్నారు.

రెంజర్ల సొసైటీలో మహాజన సభ

ముప్కాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని రెంజర్ల సొసైటీ కార్యాలయంలో శుక్రవారం సొసైటీ చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఇట్టి సభకు డైరెక్టర్‌లు ఖాతా దారులు పాల్గొనగా సొసైటీ కార్యదర్శి గంగాధర్ ఆదాయ వ్యయా లను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ ముస్కు సంతోష్‌రెడ్డి, డైరెక్టర్‌లు ఆకుల రమేష్, క్యాతం గంగారెడ్డి, దాసరి నర్సయ్య, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అంకాపూర్ అభివృద్ధి పనులకు రూ.60లక్షల మంజూరు

ఆర్మూర్‌రూరల్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసినట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్‌రావు తెలిపారు. ఐదు కుల సంఘాల భవనాలకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20లక్షలు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు రూ.30లక్షలు, సీసీరోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య శిబిరం

ఆర్మూర్‌టౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్మైల్ ది స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ షబానగౌహర్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల నిపుణులు డాక్టర్ కె.కాంతికుమార్, డెంటిస్ట్ డాక్టర్ బిందు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఓమోగ్లోబిన్ టెస్టులను చేయించి రిపోర్టులు అందజేశారు. దీంతో పలువురు విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింధుర, ప్రసన్న, సవిత పాల్గొన్నారు.

అపార్ ఐడీని వందశాతం పూర్తి చేయాలి

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల అపార్ ఐడీని ఈ నెలాఖరు కల్లా వందశాతం పూర్తి చేయాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ అర్బన్, రూరల్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల అపార్ ఐడీని వందశాతం పూర్తి చేయాలని, ఫార్మెటివ్ అసిస్‌మెంట్ 1, 2, 3, 4గ్రేడింగ్‌లను సమ్మేటివ్ అసిస్‌మెంట్ టెస్ట్ 1 ట్రేడింగ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

డొంకేశ్వర్ వారసంత వేలం

డొంకేశ్వర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారసంతకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ఆరుగురు వేలం పాటలో పాల్గొనగా డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన నారాగౌడ్ సంతకు రూ.ఒక లక్ష 11వేల వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీప్రసాద్, కార్యదర్శి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న అధికారులు

మోర్తాడ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో పలువురు అధికారులు పాల్గొన్నారు. స్థానిక మాజిద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇఫ్తార్‌విందులో ఎస్సై బి.విక్రం, ఎంపీడీవో తిరుమల, ఎంపీపీ సూపరిండెంట్ పద్మనందం, కాంగ్రెస్ నాయకులు నసీర్, ఎఎంసీ డైరెక్టర్ నవీద్; పంచాయతీకార్యదర్శి సైఫొద్దిన్, గురువయ్య పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా, ఎరువులు

వేల్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పచ్చలనడ్కుడ వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు ఫర్టిలైజర్ యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ లింబారెడ్డి తెలిపారు. శుక్రవారం పచ్చలనడ్కుడ సొసైటీ మహాజన సభ సొసైటీ చైర్మన్ లింబారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లింబారెడ్డి మాట్లాడుతూ సొసైటీలో కొత్త క్రాప్‌లోన్స్ రూ.70లక్షల వరకు ఇవ్వడం జరిగిందన్నారు. ఎరువులు, ఫర్టిలైజర్ రైతులకు అందుబాటు ఉంచుతూ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, సొసైటీ సెక్రెటరీ స్వామి, డైరెక్టర్‌లు గట్టుపుతాల నర్సారెడ్డి, తలారి శేఖర్, అంకం నాగమల్లేష్, కొమ్ముల రాజన్న పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

రెంజల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న కుట్రను తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంబేద్కర్ ముందు చూపుతోనే రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఫోకస్



రైస్‌మిల్లు నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి

కాలుష్యపు కోరల్లో ఎల్లారెడ్డి

- ఎల్లారెడ్డి పట్టణ నడి ఒడ్డున ఉన్న రైస్ మిల్లులతో తంటాలు
- వడ్లపొల్లుతో శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు
- రైస్‌మిల్లులను పట్టణ శివారులకు తరలించాలంటున్న ప్రజలు

ఎల్లారెడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు వడ్లపొల్లు.. మరోవైపు కాలుష్యంతో ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధాన రహదారి వెంట రైస్ మిల్లులు ఉండటంతో ప్రజలు అటు వైపు నుంచి ప్రయాణించాలంటేనే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వడ్లు పట్టిన తర్వాత మిగిలిన పొల్లుతో పొల్లు కాలుష్యంతో శ్వాసకోశ ఇబ్బందులు పడుతూ ప్రజలు అల్లాడుతున్నారు. రైస్‌మిల్లుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో చర్మ వ్యాధులు రావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. రైస్ మిల్లులను పట్టణ నడిబొడ్డు నుంచి తరలించి శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే తమ ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టణమంతా బూడిదమయం

ఎల్లారెడ్డి మండలంలో దాదాపు 14 రైస్ మిల్లులు ఉండగా అందులో 12 పట్టణ కేంద్రాల్లోనే ఉన్నాయి. ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే రోడ్డు అనుకొని అదే విధంగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారుల పక్కన రైస్‌మిల్లులు ఉండటంతో నిత్యం రోడ్ల గుండా ప్రయాణించే వారికి రైస్ మిల్లుల నుంచి వెలువడే దుమ్ము కాలుష్యంతో నానా తంటాలు పడాల్సివస్తోంది. వడ్లపొల్లు కళ్లమంటతో పాటు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రైస్‌మిల్లుల నుంచి వెలువడే బూడిదమయంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసమస్యలపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

పట్టణ శివారులకు తరలించాలి

పట్టణ కేంద్రంలో ఉన్న రైస్ మిల్లులు వాటి సామర్థ్యాన్ని పెంచాయి. కానీ పెంపునకు అనుగుణంగా తగు జాగ్రత్తలు పాటించాల్సిన యజమానులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైస్ మిల్లులు నడిపితే విపరీతమైన దుమ్ము, ధూళి రోడ్లపైకి నివాసపు ఇళ్లపైకి వస్తోంది. పట్టణ కేంద్రంలోని పదుల సంఖ్యలో రైస్ మిల్లులు ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నామని, రైస్‌మిల్లులను శివారు ప్రాంతాలోకి తరలించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన రైస్‌మిల్లు వద్ద ఉన్న పొల్లు

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఆసరా కోసం

ఎదురుచూపులు!

- ఉగాది, రంజాన్ పండుగలకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు
- సకాలంలో అందని ఆసరా పెన్షన్లు
- పెన్షన్ల కోసం తప్పని నిరీక్షణ

నాగిరెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పండుగలైన ఉగాది, రంజాన్ పండుగలకు ఆసరా, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, తదితర పింఛన్ల డబ్బులు అందకపోవడంతో పెన్షన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా పింఛన్ డబ్బులు అందకపోవడంతో పింఛన్ లబ్ధిదారులు ఇబ్బందులు గురవుతున్నారు. గత కొన్నినెలలుగా ఆసరా పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. ప్రతీనెల మొదటి వారంలో రావాల్సిన ఆసరా పెన్షన్లు నెల చివరికైనా రావడం లేదు. పింఛన్ల డబ్బుల కోసం పండుటాకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

30న ఉగాది, 31న రంజాన్

హిందువుల ప్రముఖ పండుగ అయిన ఉగాది పండగ ఈనెల 30న ఉండగా, ముస్లింల ప్రముఖ పండుగ అయిన రంజాన్ పండుగ ఈనెల 31న ఉంది. హిందూ, ముస్లింల రెండు ప్రముఖ పండుగలు ఒక దినం తేడాతో ఒకేసారి రావడంతో ఇటు హిందూవులు, అటు ముస్లింలు తమ తమ పండుగలను ఘనంగా జరుపుకోనున్నారు. అయితే ప్రభుత్వం పండుగ వేళ ఆసరా, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ తదితర పింఛన్ల డబ్బులను ఇప్పటివరకు మంజూరు చేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగవేళ పండుగ చేసుకునేందుకు చేతిలో చిల్లిగవ్వలేక పెన్షన్‌దారులు తీవ్రనిరాశకు లోనవుతున్నారు. ప్రభుత్వం సకాలంలో పెన్షన్‌దారుల డబ్బులు మంజూరు చేయకపోవడంతో సమయానికి పింఛన్లు అందక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో లక్షా 47వేల పెన్షన్‌దారులు

జిల్లావ్యాప్తంగా మొత్తం ఒక లక్షా 47 వేల వరకు ఆసరా, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళ తదితర పెన్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ప్రభుత్వం సుమారు రూ.31.49 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం డబ్బులను సకాలంలో కేటాయించకపోవడంతో ఆసరా పెన్షన్ల డబ్బులు లబ్ధిదారులకు సమయానికి అందడంలేదు. గత ఫిబ్రవరిలో కూడా ఫిబ్రవరి మాసం చివరివరకు ఆసరా పెన్షన్‌దారులకు డబ్బులు పంపిణీ జరగలేదు. మార్చి నెల ప్రారంభమయ్యాక మార్చి 3న ప్రభుత్వం పోస్టాఫీస్ ఖాతాల్లో డబ్బులను జమచేయడంతో పోస్టల్ అధికారులు 4వ తేదీ నుంచి పింఛన్‌దారులకు పెన్షన్ డబ్బులను పంపిణీ చేశారు. ప్రస్తుతం మార్చి నెల రెండురోజుల్లో ముగుస్తుండగా, ప్రభుత్వం ఇంతవరకు ఆసరా పెన్షన్ డబ్బులను మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులకు ఇప్పటికీ పెన్షన్ల డబ్బుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఉగాది, రంజాన్ పండుగల వేళ ఆసరా పింఛన్లు అందకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, పింఛన్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్ల డబ్బులను మంజూరు చేసి పింఛన్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పింఛన్ల పంపిణీ జరగని విషయమై నాగిరెడ్డిపేట సబ్‌పోస్టుమాస్టర్ ఆసిఫ్ అలీని ప్రశ్నించగా, ఇంతవరకు పెన్షన్ డబ్బులు రాలేవన్నారు. పెన్షన్ డబ్బులు రాగానే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

పెన్షన్ డబ్బులు ఇంకా రాలే..



● మంగలి అంజయ్య, దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారుడు, నాగిరెడ్డిపేట

ఈనెలలో ఉగాది పండుగ వస్తుంది. పింఛన్ డబ్బులు వస్తాయి అనుకుంటే ఇంతవరకు రాలేదు. పండుగ పూట పింఛన్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం పింఛన్ దారులు ఇబ్బందులు పడకుండా ప్రతీ నెల త్వరగా పింఛన్లను అందించాలి.

పేద విద్యార్థులకు వరం పీఎం ఇంటర్న్‌షిప్

- ఈనెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం
- ఇంటర్న్‌షిప్ వ్యవధి 12 నెలలు
- మొదటి 6 నెలలు 5 వేల భత్యం
- వన్ టైం గ్రాంట్ రూ.6 వేలు

కామారెడ్డిటౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి రెండోదశ దరఖాస్తు ప్రక్రియ ఈనెల 31తో ముగియనుంది. 24 ఏళ్లలోపు యువత కోసం ఈస్కీంను కేంద్రప్రభుత్వం రూపొందించింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది విద్యార్థులకు ఇది వరం లాంటిందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పదోతరగతి ఆపై చదువుకున్న చాలామంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్ స్కీంకు అర్హులు. గత మూడేళ్లలో ఖర్చుల ఆధారంగా అగ్రశ్రేణి కంపెనీలను గుర్తించారు. గ్యాస్, చమురు, ఇంధన రంగానికి ఇంటర్న్‌షిప్ పథకంలో నమోదుకోసం గరిష్ఠ అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆ తర్వాత టూర్- ట్రావెల్, హస్పిటాలిటీ రంగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నట్లు వివరించారు.

21 నుంచి 24 ఏళ్లవారు అర్హులు

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి 10, 12వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీకాం, బీసీఏ, బీబీఏ,బీఫార్మాసీ చదివిన 21 నుంచి 24 ఏళ్ల మధ్య ఉన్న యువత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాలం 12 నెలలు కాగా ఇంటర్న్‌షిప్ కాలంలో కనీసం 6నెలల పాటు వ్యాపార వాతావరణంలో శిక్షణ అనుభవం లేదా ఆ తర్వాత ఉద్యోగ వాతావరణంలో గడపాల్సి ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు పీఎంఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో స్టైపండ్‌గా రూ.5వేలు అందిస్తుండగా ఇందులో రూ.4500 కేంద్రప్రభుత్వం, రూ.500 కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద సంబంధిత కంపెనీ అందిస్తుంది. 6నెలల తర్వాత వన్‌టైం గ్రాంట్ రూ.6 వేలు అందిస్తారు. కుటుంబ ఆదాయం రూ.8లక్షల లోపుఉండాలి. ప్రతీ ఇంటర్న్ కూడా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన కింద బీమా చేయబడుతారు.

వీరు అర్హులు కారు

తల్లిదండ్రులు లేదా భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు లేదా కుటుంబ ఆదాయం రూ.8లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు లేదా పూర్తిసమయం కోర్సులు చదువుతున్న యువకులు, ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటి వంటి సంస్థల నుంచి డిగ్రీలు పొందిన యువత దరఖాస్తులు ఈ పథకానికి అంగీకరించబడవు. వృత్తిపరమైన డిగ్రీలు ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. అలాగే ఏదైనా స్కిల్అప్రెంటిషిప్ ఇంటర్న్‌షిప్ చేసిన యువత ఈ పథకానికి అర్హులుకారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థి శిక్షణ కార్యక్రమంలో భాగమైన యువత, నేషనల్ అప్రెంటిసిషిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం లేదా నేషనల్ అప్రెంటిషిప్ ప్రమోషన్ స్కీమ్ కింద ఎప్పుడైన అప్రెంటిషిప్ పూర్తిచేసిన లేదా శిక్షణ పొందుతున్న యువత దరఖాస్తుకు అర్హులు కారు.

ఈనెల 31 వరకు దరఖాస్తుకు అవకాశం

● లాల్‌నాయక్, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం



ఈ పథకానికి ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకుని ఎంపికైన యువతకు ఇంటర్న్‌షిప్ చేయడానికి కంపెనినీ కేటాయిస్తారు. ఆ తర్వాత జాబ్ఆఫర్ లెటర్లు అందింవారికి కేటాయించిన కంపెనీల లో ఇంటర్న్‌షిప్ ప్రారంభిస్తారు. మొత్తం పథకంలో కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానం వర్తిస్తుంది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో దేశంలో టాప్ 500 కంపెనీలలో ఇంటర్న్‌షిప్ ఇవ్వడం ద్వారా దేశవ్యాప్తంగా కోటిమంది యువత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటో, విద్యార్హత ధృవపత్రాలు తప్పనిసరి. 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

తాళం వేసి ఉన్న ఇళ్లే.. టార్గెట్

- అర్ధరాత్రి దాటాకే దొంగతనాలు
- కట్టర్లు, మరణాయుధాలతో గ్రామాల్లోకి ప్రవేశం
- వరుస ఘటనలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



బస్వాపూర్‌లో మరణాయుధాలతో సంచరిస్తున్న వ్యక్తుల సీసీ కెమెరా ఫుటేజీ (ఫైల్)



బస్వాపూర్‌లో తాళం పగులగొట్టిన దృశ్యం

భిక్కనూరు, మార్చి28 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉంటే చాలు తెల్లారేసరికి ఆ ఇల్లును గుల్ల చేస్తున్నారు దొంగలు. చప్పుడు కాకుండా ఇరువైపులా ఇళ్లకు గొళ్లెం పెట్టి అందినకాడికి దోసుకుని పరారవుతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా రోడ్డు గుండాకాకుండా మరోవిధంగా తాళం వేసి ఉన్న ఇంటి వద్దకు చేరుకుని ఎలాంటి భయం లేకుండా దుండగులు దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో గురువారం అర్ధరాత్రి గ్రామంలో తాళం వేసి ఉన్న తొమ్మిది ఇళ్లల్లో చోరీచేసి బంగారం, వెండి, నగదును, బైక్‌ను ఎత్తుకెళ్లారు. ప్రతీ ఇంటి తాళాన్ని దొంగలు కట్టర్లతో కట్ చేసినట్లు ఉండటం, గ్రామంలో అక్కడక్కడా ఉన్న సీసీ కెమెరాల వైర్లను సైతం కత్తిరించడంతో వీరు పక్కా ప్రణాళికతోనే ఈ దొంగతనాలు చేసినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఒకేరోజు తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

పక్కా ప్లాన్‌తో దోచేస్తున్నారు..

గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లనే ఎంచుకుని దొంగలు అందినకాడికి దొచుకుని పోతున్నారు. గ్రామాల్లో ఉదయం ఏదోఒక వస్తువులను అమ్ముకోవడానికి వచ్చినవారే ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్ల సమీపంలో సీసీ కెమెరాలు ఉంటే మరోమార్గాన్ని ఎంచుకుని ఆ మార్గం గుండానేవారు ఎంచుకున్న ఇంటి వద్దకు అర్ధరాత్రి దాటిన తర్వాతే చేరుకుని ఇంటి ఇరువైపులా ఉన్న ఇళ్లకు గొళ్లె పెట్టి ఏ చిన్నశబ్దం రాకుండా పక్కాప్లాన్‌తో దొంగతనాలకు పాల్పడుతున్నారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

బస్వాపూర్, సిద్దరామేశ్వరనగర్‌తో పాటుగా పలు గ్రామాల్లో సైతం ఇదే తరహా దొంగతనాలు చోటుచేసుకున్నాయి. జాతీయ రహదారిని అనుకుని ఉన్న గ్రామాలను ఎంచుకుని ఉదయం పూట రెక్కీ నిర్వహించి రాత్రివేళల్లో పెద్ద కట్టర్లు, మరణాయుధాలతో గ్రామాల్లోకి చేరుకుని దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నినెలల ముందు ఇదే గ్రామంలో ఐదుగురు దుండగులు కట్టర్లు, మరణాయుధాలతో సంచరించగా సీసీ కెమెరాల్లో రికార్డైయ్యాయి. అదేరోజు సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో తాళం కట్‌చేసి లోనికి చొరబడి బంగారం నగదును దొంగలు ఎత్తుకెళ్లిన ఘటనలు ఉన్నాయి.

కేసు దర్యాప్తు చేస్తున్నాం..

● ఆంజనేయులు, ఎస్సై, భిక్కనూరు

బస్వాపూర్‌లో తొమ్మిది తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనం జరిగి కొంత బంగారం, నగదును దొంగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నాం. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నాం. ఇళ్లలో బంగారం, నగదును పెట్టి ప్రయాణాలు చేయవద్దు.

9 తులాల బంగారం, నగదు చోరీ

మండలంలోని బస్వాపూర్‌లో జరిగిన చోరీ ఘటనలో బంగారం, నగదు చోరికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. తాళం వేసి ఉన్న గ్రామానికి చెందిన దాకి రమేష్, దాకి నాగమణి, మామిడి సత్తవ్వ, బాజే సుజాత, వంక సువర్ణ, మన్నె ధర్మరాజు, చింత చంద్రయ్య, చింత వినయ్, పోన్నాయిల స్వామి ఇళ్లలోకి చొరబడి సుమారు తొమ్మిది తులాల బంగారం, రూ.లక్షకు పైగా నగదును, లింగరాజు నవీన్‌కు చెందిన ద్విచక్రవాహన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా దొంగలు పలువురి ఇళ్ల గుమ్మం వద్ద రూ.50 నోట్లను ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న క్లూస్‌టీం గ్రామానికి చేరుకుని దొంగతనం జరిగిన ఇళ్లలో వేలిముద్రలను సేకరించారు.



ఆలయ ఆవరణలో గల అష్టముఖి కోనేరు

అష్టముఖి కోనేరు వద్ద ఏర్పాట్లు పూర్తి

ఎడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శనివారం అమావాస్య సందర్భంగా ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామశివారులో గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో గల అష్టముఖి కోనేరు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వేణు తెలిపారు. శనివారం అమా వాస్యను పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి అష్టముఖి కోనేరులో స్నానమాచరించి, ఆలయంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహ స్వామిని దర్శించుకుంటారు. ఆలయానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఆలయానికి వచ్చి అష్టముఖి కోనేరులో స్నానమాచరిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ తెలిపారు.

అదనపు తరగతి గదులు నిర్మించరూ!

పెద్దకొడప్‌గల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ప్రభుత్వం ఆయా గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం చేపట్టడంతో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రయివేట్ బడులకు వెళ్లిన విద్యార్థులంతా నేడు ప్రభుత్వ బడులను వచ్చేశారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలో పెరుగుదల నమోదైంది. అయితే మండలంలోని కుబ్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాల ఉండగా ఒక తరగతి గది ఉంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 40కి పైగా ఉండటంతో బోధనకు తరగతి ఇరుకుగా మారిందని తండావాసులు చెప్తున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు పాఠశాలకు హాజరైతే కూర్చోడానికి కష్టంగా మారుతుందని చెప్తున్నారు. కొన్ని తరగతులు విద్యార్థులు పాఠశాల లోపల కూర్చుంటే మరి కొంతమంది విద్యార్థులకు గది బయట కూర్చోబెట్టుకుని ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరానికి అయినా తండాలో అదనపు తరగతి గది నిర్మాణం చేయాలని తండా వాసులు కోరుతున్నారు.



కుబ్యా నాయక్‌తండాలో గల పాఠశాల

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఖిల్లా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కును సీపీ సాయిచైతన్య అందించారు. శుక్రవారం సీపీ చాంబర్‌లో భద్రత ఎక్స్‌గ్రేషియా రూపంలో 16లక్షల రూపాయల చెక్కును సిబ్బంది కుటుంబానికి అందించారు. పోలీస్‌శాఖలో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ సోలమాన్ పనిచేస్తూ ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వారెడ్డి, ఏవో అనిసాబేగం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, శ్రీనివాస్, వెల్ఫేర్ సతీష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్‌పాషా, పి.రాజేశ్వర్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్‌ల అందజేత..

వివిధ కారణాలతో వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు సీపీ సాయి చైతన్య అందజేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ డివిజన్‌లలో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన 125 సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించారు.

బీసీటీయూ డైరీ ఆవిష్కరించిన సీపీ..

బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆవిష్కరించారు. శుక్రవారం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఆయన డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, మోహన్, రామకృష్ణ, విజయలక్ష్మీ, గంగోని సంజీవ్, రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు..

నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయిచైతన్యను బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీపీకి వివరించారు. సీపీని కలిసిన వారిలో లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, పద్మారెడ్డి, ఆనంద్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి

మోపాల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి బాటలో నడుస్తుందని బోర్గాం (పి) సొసైటీ చైర్మన్, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోర్గాం (పి) సొసైటీ ఆవరణలో మహాజన సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి చెందాలంటే రైతుల సహకారం తప్పనిసరి అని అన్నారు. ఈ సొసైటీ పరిధిలో బోర్గాం (పి), ఠాణాకుర్దు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ జయకృష్ణ, డైరెక్టర్లు, గ్రామ పెద్దలు భూంరెడ్డి, చిట్టిసాయిరెడ్డి, సూర్యరెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

డిచ్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి సొసైటీ పరిధిలోగల నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సంఘాలకు కేటాయించారని రైతులు మాత్రం సొసైటీ ద్వారా కొనుగోలు చేసే విధంగా తీర్మానం చేయాలని విన్నవించినట్లు సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం డిచ్‌పల్లి సొసైటీలో జరిగిన మహాజన సభలో చైర్మన్ రాంచందర్ మాట్లాడుతూ నడిపల్లి, దూస్‌గాం, లింగసముద్రం, కొరట్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు ఐకేపీ సంఘాలకు కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుమ్మరి చిన్న గంగారాం, డైరెక్టర్లు నర్సింలు, రమేష్, హరిచంద్, గంగారెడ్డి, సంతోష్, శ్యామ్‌సన్, సీఈవో కిషన్, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థి అభివృద్ధి కార్యక్రమం

ధర్పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థి అభివృద్ధి కార్యక్రమాన్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంపార్టెంట్స్ ఆఫ్ రీసర్చ్ మెథడాలజీ ఇన్ ప్రాజెక్టు రిపోర్ట్ రైటింగ్ అనే అంశంపై ఒకరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్య అభివృద్ధి కార్యక్రమానికి ప్రధాన ప్రసంగ కర్తగా ప్రొఫెసర్ రామకృష్ణ హైదరాబాద్ డాటా అనలైసిస్, ప్రాజెక్టు రిపోర్ట్ అంశం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రభాకర్, రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, శారద, గంగాధర్, సంజీవ్, పద్మ, రాంచందర్ పాల్గొన్నారు.

బాల వికాస్‌తో చిన్నారులకు ఆత్మస్థైర్యం

ధర్పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి దేవసమితి ఆధ్వర్యంలో నిర్వహించే బాల వికాస్ కార్యక్రమంలో చిన్నారులకు ఆధ్యాత్మిక భావంతో పాటు క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని బాల వికాస్ జిల్లా ఇంచార్జి డాక్టర్ మంజుల, సేవాదళ్ ఇంచార్జి పుష్పలత, బాలవికాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శోభలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోగల సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బాలవికాస్ చిన్నారుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు.

అలరించిన కవి సమ్మేళనం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):విశ్వావసు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శబ్దతరంగిని ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్దగల గీతా భవన్‌లో తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని కవులు తమ కవితాగానం చేశారు. అందరికి శుభాలు కలిగించాలని కోరుకుంటూ కవులు తమ కవితలను వినిపించారు. తొగర్ల సురేష్ వసంతోత్సవా, చంద్రశేఖర్ శర్మ బంగారు ఉగాది, అభిలాష్ శర్మ స్వాగతం సుస్వాగతం, తదితర కవులు తమ కవితలను చదివారు. ఈ సందర్భంగా శబ్దతరంగిని అధ్యక్షుడు దయానంద్ ఉగాది పర్వదిన ప్రాశ్యస్త్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో కొనసాగుతున్న క్రీడా పోటీలు

డిచ్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో 11 జట్లు పాల్గొనగా ఫైనల్ పీజీ సీనియర్ మరియు పీజీ జూనియర్స్ జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ ఇంచార్జి డాక్టర్ జి.బాలకిషన్, వర్సిటీ పీఆర్‌వో డాక్టర్ పున్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ బీఆర్ నేత, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపాలిటీలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులంతా బహుజన శ్రామిక కులానికి చెందిన వారేనని కార్మికుల పట్ల కుల వివక్షతతో కూడిన శ్రమదోపిడి చేస్తున్నారని విమర్శించారు. గత నాలుగు రోజులుగా బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్, హెల్ప్ గ్రూపుల ద్వారా పనులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వడం ఎవరి ప్రయోజనాల కోసమని దండివెంకట్ ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు టెండర్లు కట్టబెట్టిన బీఎల్‌టీయూ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏ



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

విధంగానైతే సెల్ఫ్ గ్రూపుల ద్వారా పనులు నిర్వహిస్తున్నారో అదే విధానాన్ని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల రాజేందర్, అనిల్, గంగాసాగర్, రాహుల్, మురళి, రతన్, నవీన్, ఎల్లయ్య, మోహన్‌గౌడ్, సాయిలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ చైర్మన్ కేతావత్ యాదగిరి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. బంజారాల పక్షాన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కొన్నేళ్ల నుంచి గిరిజన బంజారాల భాష అయిన గోర్‌బోలికి రాజ్యాంగంలో చేర్చి ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి గిరిజన బంజారాల పక్షాన నిలబడి గోర్‌బోలి భాషను రాజ్యాంగ 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందేలా చేయాలన్నారు. రాబోయే రోజుల్లో గోర్‌బోలి భాషను పాఠ్యపుస్తకాల్లో



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్టీసెల్ నాయకులు

ప్రత్యేక సబ్జెక్టుగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్, మాజీ కార్పొరేటర్ ఛాంగుబాయి, సుభాష్ జాదవ్, మాంక్యానాయక్, బాల్‌రాజ్, చందర్‌నాయక్, పీర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు జిల్లాలోని వెనుకబడిన వర్గాల బీసీ, ఈబీసీ (ఈడబ్ల్యుఎస్), ఫెడరేషన్‌లకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణం పొందవచ్చని, 50వేల రూపాయల లోపు విలువ చేసే యూనిట్‌కు వంద శాతం సబ్సిడీ వర్తిస్తుందని, లక్షలోపు యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ, 2లక్షల యూనిట్‌కు 80 శాతం సబ్సిడీ, 4లక్షల వరకు విలువ చేసే యూనిట్‌కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపనకు 21-55 ఏళ్ల వయస్సు వ్యవసాయ ఆధారిత పథకాలకు 21-60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాలవారు రూ.2లక్షలలోపు ఉన్నవారు అర్హులన్నారు. బ్యాంకు సమ్మతి తప్పని సరి ఉండాలని దరఖాస్తుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కుల ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులు తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఆసక్తిగల వెనుకబడిన వర్గాల నిరుద్యోగ యువతీ యువకులు టీజీవోబీఎంఎంఎస్‌న్యూ.సిజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తులను అర్జిదారు డౌన్‌లోడ్ చేసుకొని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతా ప్రతులను జతచేసి సంబంధిత ఎంపీడీవోలకు, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అల్పసంఖ్యాక అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలి..

రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలోని అల్పసంఖ్యాక అభ్యర్థులు సైతం దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద అన్ని కార్పొరేషన్‌లకు సంబంధించి ఉమ్మడి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని దీనిలో భాగంగా తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రైస్తవ మైనార్టీ కమ్యూనిటికి చెందిన యువత స్వయం ఉపాధి వ్యాపారాలను ప్రారంభించడంలో ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేయబడుతుందని కావున అర్హులైన క్రిస్టియన్ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు కొన్ని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవికాలంలో ఒంటిపూట బడులకు బదులు రెండు పూటల పాఠశాలు నడుపుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అలా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని లేనిచో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మోపాల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాడ్సి గ్రామంలో చలివేంద్రాన్ని శుక్రవారం మోపాల్ మండల అభివృద్ధి అధికారి రాములు నాయక్ ప్రారంభించారు. ఎండ తీవ్రంగా పెరగడంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజల దాహార్తిని తీర్చడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించడం అభినందనీయమని ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలోగల పాతబస్టాండ్‌లో స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో బాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వర్తింపు

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఈ పథకం కింద రూ.20వేల ఆర్థిక సహాయం అందజేయబడుతుందని ఆయన తెలిపారు. ప్రాథమిక జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎస్‌బీఎస్) వర్తిస్తుందన్నారు. ప్రాథమిక జీవనాధార వ్యక్తి మరణించినట్లయితే అతని వయస్సు 18 ఏళ్లు పైబడి 60 ఏళ్లలోపు ఉండాలన్నారు. అర్హులైన వారు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అర్హత కలిగిన కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శానిటేషన్ నిర్వాహణ కోసం ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు గత మూడేళ్లుగా పని చేస్తున్న కనీస వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదన్నారు. వారంతపు సెలవులు, పండుగ సెలవులను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అలకనంద, నవనీత, లక్ష్మి, పద్మ, రమ, హేమ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల చివరి శుక్రవారం పురస్కరించుకొని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. జమేతే ఉల్ విదా సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధానమైన మసీదులతో పాటు వీధులలోని మసీదులలో పెద్ద సంఖ్యలో ప్రార్థనలో పాల్గొన్నారు. మరణించిన తమ బంధువులు, స్నేహితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గంజాయి రవాణా చేస్తున్న ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయిని రవాణా చేస్తున్న షోయబ్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2కిలోల 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విలాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాలపల్లికి చెందిన షోయబ్‌ఖాన్ ఖానాపూర్ గ్రామంలోని జన్నేపల్లి రోడ్డు నుంచి గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా ఖచ్చితమైన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 2కిలోల 100 గ్రాముల గంజాయిని, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై సింధూ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ఇద్దరి అరెస్టు

డిచ్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామం ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. 27న రాత్రి నడిపల్లి ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి వెళ్లి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి గోడదూకి పారిపోయారు. సీఐ మల్లేష్, ఎస్సై షరీఫ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏటీఎం దొంగతనానికి యత్నించిన రుద్రబోయిన గణేష్, నిమ్మబోయిన సురేష్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో బైకులు, ఇళ్లలో, గుడిలలో దొంగతనాలు చేసి కేసులలో వీరిని జైలుకు పంపించడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి 12వేల రూపాయల నగదు, నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జిల్లా బార్ అసోసియేషన్‌లో పలువురి ఏకగ్రీవ ఎన్నిక

నిజామాబాద్ లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా బార్ అసోసియేషన్‌లో ఎన్నికల నామినేషన్లు, విత్‌డ్రాలు పూర్తయ్యాయి. అధ్యక్ష పదవికి ఎం.సాయిరెడ్డి, కోశాధికారిగా జి. నారాయణ దాసు, గ్రంథాలయ కార్యదర్శిగా శ్రీమన్, లేడి రిప్రజెంట్‌గా జె. రమాదేవితో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మద్దెపల్లి శంకర్, మహ్మద్ అయూబ్, భిక్షపతి, మహ్మద్ ముబీన్, ఎ.నారాయణ, ఇంతియాజ్, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు జె. వెంకటేశ్వర్. ఆర్.ఎస్.ఎల్. గౌడ్, ఎర్రం విఘ్నేష్, పిట్ల రవి, మధుసూదన్ గౌడ్‌లు తెలిపారు. మిగతా ఉపాధ్యక్ష పదవి, జనరల్ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలకు వచ్చేనెల 11న ఎన్నికలు నిర్వహించనున్నటు వార్లు తెలిపారు.



ఇందల్వాయి- మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న తుకారాం రాథోడ్

నాణ్యమైన భోజనాన్ని అందజేయాలి

ఇందల్వాయి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి వంట చేసే సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. వంట చేసే టప్పుడు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని వంట పూర్తయిన తర్వాత అయోడిన్ ఉప్పును కలపాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఎండలో అనవసరంగా తిరగవద్దని తద్వారా వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. పాఠశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి తెలియజేశారు. ఎండాకాలంలో ద్రవపదార్థాలను అధికంగా తీసుకోవాలని ఇంట్లో ఉన్నప్పుడు చిటికెడు ఉప్పు, పిడికెడు పంచదారా గ్లాసులో కలుపుకొని తాగాలన్నారు. అన్నం తినే ముందు చేతులు, కాళ్లు కడుకొని భోజనం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సుశాంత్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్త శారద, ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, ఆనంద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

డిచ్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి డిచ్‌పల్లి షాదీ ఖానాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చిన ఇఫ్తార్ విందుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, మైనార్టీలూాల్గొన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన సైన్స్ పేపర్-1 ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9.30ల నుంచి 11గంటల వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 22,904 మంది విద్యార్థులకు గాను 22,842 మంది విద్యార్థులు హాజరుకాగా 62 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. జిల్లా విద్యాశాఖ అధికారి 5 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 27 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

డిచ్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎంపీపీ మాజీ అధ్యక్షుడు కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పంచాయతీ కోసం ప్రత్యేక నిధులను కేటాయించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా అంజన్న పడిపూజ

ధర్పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల రేణుక ఎల్లమ్మ ఆలయంలో అంజన్నస్వామి పడిపూజ కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్నస్వామికి పంచామృతంతో అభిషేకాలు, భజనలు, కీర్తనలు, స్వామివారి నామస్మరణలతో పూజా కార్యక్రమాలు జరిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్న స్వాములు కొండగట్టుకు వెళ్లి మాలాధారణ విరమణ చేస్తారు. నియమనిష్టలతో 41 రోజుల పాటు అంజన్న భక్తులు ఉదయం 4గంటలకు నిద్రలేచి స్వామివారి ఆరాధనలో తరలిస్తారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.210	రూ. 230



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.91,400	రూ.84,400	రూ.1050

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : రాబిన్‌హుడ్ (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-2 : ఎల్-2 ఎంపురాన్ (10.10)
: కోర్టు (1.45)
: మ్యాడ్ స్క్వేర్ (4.50, 7.30, 10.30)
స్క్రీన్-3 : వీర ధీర (10.05, 4.10, 7.30, 10.50)
: మ్యాడ్ స్క్వేర్ (1.25)
స్క్రీన్-4 : మ్యాడ్ స్క్వేర్ (10.00)
: ఎల్-2 ఎంపురాన్ (12.45, 7.25, 11.00)
: కోర్టు (4.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాడ్ స్క్వేర్ (10.45, 1.20, 4.20, 7.20, 10.20)
స్క్రీన్-2 : వీరధీర (10.50, 7.40)
: రాబిన్‌హుడ్ (1.40)
: ఎల్-2 ఎంపురాన్ (4.20, 10.30)
స్క్రీన్-3 : వీర ధీర (1.30)
: రాబిన్‌హుడ్ (4.30, 7.30, 10.20)

లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : రాబిన్‌హుడ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఎల్-2 ఎంపురాన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్